నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
15 హైదరాబాద్, శనివారం 10 ఫిబ్రవరి 2024 HYDERABAD




# మహాలక్ష్మికి ఇబ్బందులు

## బస్‌షెల్టర్ల వద్ద బస్సులు ఆపొద్దంటున్న పోలీసులు

రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ సాకుతో డ్రైవర్లపై ఒత్తిడి

'ఫ్రీ బస్సు'తో గణనీయంగా పెరిగిన ప్రయాణికులు

ఆంక్షల విధింపుతో ఆర్టీసీకి తిప్పలు.. శాఖల మధ్య కొరవడిన సమన్వయం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): సిటీ బస్సులకు కష్టకాలం వచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తెచ్చిన మహాలక్ష్మి పథకంతో ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ఆర్టీసీని ప్రభుత్వమే అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నది. నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో బల్దియా కోట్లు ఖర్చు పెట్టి..బస్ షెల్టర్లను ఏర్పాటు చేసింది. అయితే ఆయా ప్రాంతాల్లో ప్రయాణికులు ఎక్కడం దిగడం కోసం బస్సులను ఆపవద్దంటూ..ట్రాఫిక్ సమస్య పేరుతో పోలీసులు అభ్యంతరాలు పెడుతున్నారు. ఈ విషయంలో ఆర్టీసీ డ్రైవర్లపై ఒత్తిడి కూడా తెస్తున్నారు. మహాలక్ష్మి పథకంతో సిటీబస్సుల్లో అధిక సంఖ్యలో మహిళలు ప్రయాణిస్తున్నారు. దీంతో ఆర్టీసీకి ఆదాయం కూడా పెరిగింది. ఈ నేపథ్యంలో ఒకవైపు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తూనే.. బస్సులను ఎక్కడపడితే అక్కడ ఆపొద్దంటూ.. ఆంక్షలు పెట్టడం ఏమిటని పలువురు ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు.

### ట్రాఫిక్ ఇబ్బందంటూ..

నగరంలో జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, హైటెక్‌సిటీ, రాయదుర్గం వంటి అనే ప్రధాన ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్‌లు అవుతున్నాయని, దానికి ఆర్టీసీ సిటీ బస్సులే కారణాలవుతున్నాయని పోలీసులు చెబుతున్నారు. జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసిన షెల్టర్లలోనే బస్సులు ప్రయాణికుల కోసం నిలుపుతున్నామని ఆర్టీసీ గ్రేటర్ అధికారులు స్పష్టం చేస్తున్నారు. అయితే నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ కోసం గుర్తించిన చోట్ల ఉన్న బస్‌షెల్టర్లలో బస్సులు నిలుపవద్దని పోలీసు అధికారులు స్పష్టం చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటే దాని ప్రకారమే బస్‌షెల్టర్లలో బస్సులు నిలుపాలా? లేదా ? అనేదానిపైనా ఆర్టీసీ యాజమాన్యం కూడా నిర్ణయం తీసుకుంటుందని చెబుతున్నారు. మొత్తానికి బస్‌షెల్టర్లలో సిటీ బస్సులు నిలుపడం విషయమై పోలీసు, జీహెచ్‌ఎంసీ, ఆర్టీసీ యాజమాన్యాల మధ్య ప్రస్తుతం సమన్వయం కొరవడినట్లు తెలుస్తున్నది. కాగా, రెండు రోజుల కిందట జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో నగర పోలీసు విభాగంతో పాటు ఆర్టీసీ గ్రేటర్ అధికారులతో జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసినట్లు సమాచారం. దీనిపై మూడు ప్రభుత్వ విభాగాల్లో విభిన్న అభిప్రాయాలు వ్యక్తమైనట్లు చెబుతున్నారు. అయితే ప్రయాణికులు మాత్రం తమకు అందుబాటులో బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయడం వల్ల ప్రయాణం సౌకర్యవంతంగా ఉంటుందని, లేదంటే ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాల్లో వెళ్లాల్సి వస్తుందని, ఇది తమకు తలకుమించిన ఆర్థిక భారంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్‌లోని టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీని కలిసేందుకు వచ్చిన విద్యుత్ మీటర్ రీడర్లు

# గృహజ్యోతికి తిప్పలు?

## విద్యుత్ మీటర్ రీడర్ల ఆందోళన బాట

బిల్లుల జారీలో జాప్యం.. శ్లాబ్ రేటు పెరిగే చాన్స్

గృహజ్యోతి పథకం అమలుపైనా తీవ్ర ప్రభావం

సిటీబ్యూరో, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): ఇంటింటికీ తిరిగి కరెంటు మీటర్ రీడింగ్ తీసే సిబ్బంది ఆందోళన బాట పట్టారు. సుదీర్ఘకాలంగా తమ సమస్యల్ని అధికారులకు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదని, గత్యంతరం లేకే ఆందోళన చేస్తున్నామని మీటర్ రీడర్లు చెబుతున్నారు. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్‌పీడీసీఎల్) పరిధిలో పీస్ రేట్ వర్కర్లుగా పనిచేస్తున్న కరెంటు మీటర్ రీడర్లకు నెలలో కేవలం 15 రోజులు మాత్రమే పని ఉంటుంది. ఒక మీటర్ రీడింగ్ తీస్తే వారికిచ్చేది కేవలం రూ. 2.51 పైసలు, అందులోనూ 50 నుంచి 60 పైసలు మినహాయించుకొని మిగిలిన సొమ్మును మీటర్ రీడర్లకు చెల్లిస్తున్నారు. ఇలా ప్రతి నెలా 1వతేదీ నుంచి 15వ తేదీ వరకు పనిచేశాక, మిగిలి రోజుల్లో ఖాళీగా ఉండాల్సి వస్తోందని, మిగిలిన 15 రోజుల్లో తమకు పని కల్పించాలని అనేకసార్లు విద్యుత్ సంస్థ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేసినా, వారు పట్టించుకోవడం లేదని మీటర్ రీడర్లు వాపోతున్నారు. విద్యుత్ సంస్థలో అనేక విభాగాల్లో తమ సేవలను వినియోగించుకునే అవకాశాలు ఉన్నా, యాజమాన్యం పని ఇచ్చేందుకు అంగీకరించడం లేదని, సుదీర్ఘ కాలంగా ఈ సమస్యపై అనేకసార్లు ఆందోళనలు చేసినా పట్టించుకోకపోవడంతోనే ఆందోళన చేస్తున్నామని టీఎస్ఎస్‌పీడీసీఎల్ విద్యుత్ మీటర్ రీడర్ల యూనియన్ ప్రధాన కార్యదర్శి జి. చిరంజీవి తెలిపారు. 'ఉన్నత చదువులు చదువుకొని ఉన్నాం..ఇదే సంస్థను నమ్ముకొని 22 ఏండ్లుగా పనిచేస్తున్నాం.. నెలంతా పని కల్పించి ఆర్టిజన్లుగా గుర్తించాలని చేస్తున్న మా డిమాండ్లను మాత్రం అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి మా సమస్యను గుర్తించి, న్యాయం చేయాలి' అని కోరుతున్నామన్నారు.

### కరెంటు బిల్లులు..

రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి మీటర్ రీడింగ్‌తో పాటు వినియోగదారుల ఫోన్ నంబరు, ఆధార్‌నంబరు, ఆహార భద్రతా కార్డు నంబర్లను నమోదు చేయాలని మీటర్ రీడర్లకు డిస్కం అధికారులు సూచించారు. అయితే విద్యుత్ మీటర్ రీడర్ల ఆందోళన నేపథ్యంలో బిల్లుల జారీలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. ఇదిలా ఉంటే.. శుక్రవారం విద్యుత్ మీటర్ రీడర్ల యూనియన్ నేతలు టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీని కలవడానికి వచ్చారు. సీఎండీ లేకపోవడంతో ఇతర ఉన్నతాధికారులను కలిశారు. 'మీ సమస్య మా దృష్టికి వచ్చింది.. పరిశీలిస్తున్నా'మని వారు తెలిపారు. ఈనెల మీటర్ రీడింగ్ తీసే వారికి 2 రూపాయలు అదనంగా ఇస్తామని అధికారులు చెప్పినా, అయిష్టంగానే నేతలు వెళ్లిపోయారు.







## మన పీవీ.. భారతరత్న

భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు 'భారతరత్న' దక్కడం పట్ల పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. పీవీకీ దేశ అత్యున్నత పురస్కారం రావడం యావత్ తెలంగాణకు గర్వకారణమన్నారు.

## ఎఫ్‌వోబీలకు స్థలాలను గుర్తించండి

### బల్దియా కమిషనర్ రోనాల్డ్ రాస్



సిటీబ్యూరో, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ) : నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన జంక్షన్ల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కమిషనర్ రోనాల్డ్‌రాస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కమిషనర్ తన చాంబర్‌లో టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పాదచారుల ప్రమాదాల నివారణకు అవసరమైన చోట ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలకు స్థలం గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే నగరంలో 22 ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను చేపట్టగా ఇప్పటి వరకు 11 అందుబాటులోకి వచ్చాయన్నారు.



సికింద్రాబాద్ ఎస్పీ రోడ్‌లోని గుజరాతీ స్కూల్‌లో గుజరాతీ ఎక్తా మహోత్సవ్ ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా మిస్ అండ్ మిసెస్ పేరిట జరిగిన కార్యక్రమంలో అతివలు సందడి చేశారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి..సిలిండర్

# సీఎన్‌జీలో గంజాయి

## ఆంధ్రా నుంచి ఆగ్రాకు అక్రమ రవాణా

పోలీసులకు పట్టుబడిన ముఠా

రెండు కార్లు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం

నలుగురు నిందితుల రిమాండ్

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 9: ఏకంగా సీఎన్‌జీ సిలిండర్‌లో గంజాయిని తరలిస్తూ.. పోలీసులకు పట్టుబడిందో ముఠా. శుక్రవారం పేట్ బషీరాబాద్‌లో మేడ్చల్ జోన్ డీసీపీ నిఖితపంత్, ఎస్‌వోటీ డీసీపీ శ్రీనివాస్, మేడ్చల్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, మేడ్చల్ సీఐ శివకుమార్ వివరాలు వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు మేడ్చల్ ఎస్‌వోటీ, మేడ్చల్ పోలీసులు సంయుక్తంగా మేడ్చల్ ఓఆర్ఆర్ ఆక్సిజన్ పార్క్ వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో రెండు కార్లను పరిశీలించగా, ఓ వాహనం డిక్కీలో సీఎన్‌జీ ఖాళీ సిలిండర్ కనిపించింది. అందులో గంజాయి ప్యాకెట్లను గుర్తించారు. రెండు కార్లలో ఉన్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని..విచారించగా, వారు యూపీకి చెందిన అరవింద్‌చౌదరి(28), అభిషేక్ తోమర్(36), ఆశిశ్‌కుశ్వంత్(25), ఆకాశ్‌సొలంకి(25)గా తేలింది. ఇందులో అరవింద్‌చౌదరి ఓ మర్డర్ కేసులో జైలుకెళ్లి వచ్చాడు. సులువుగా డబ్బులు సంపాదించేందుకు ఈ నలుగురు గంజాయి దందాను మొదలుపెట్టారు. ఈ మార్గంలో అనేక సార్లు గంజాయిని తరలించినట్లు తెలిపారు. ఇందులోభాగంగానే వైజాగ్‌లో 65 కిలోల ఎండు గంజాయిని కొనుగోలు చేసి.. ఆగ్రాకు తరలించేందుకు సిద్ధమయ్యారు. కారు డిక్కీలో సీఎన్‌జీ సిలిండర్ మధ్యలో రంధ్రం చేసి తాళం బిగించి.. అందులో గంజాయిని దాచిపెట్టారు. మరో కారును ఈ వాహనానికి కాన్వయ్‌గా ఉపయోగించారు. చివరికి పోలీసులకు చిక్కారు. నిందితుల నుంచి రెండు కార్లు, ఆరు సెల్‌ఫోన్లతో పాటు రూ.40 లక్షల విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకొని.. రిమాండ్‌కు తరలించారు.



## 20 రోజులు.. ₹650 కోట్లు

ఆస్తిపన్ను వసూళ్లపై స్పెషల్ ఫోకస్

సిటీబ్యూరో: కొద్ది రోజుల్లోనే పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతుందన్న నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ ఆస్తిపన్ను వసూళ్లపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలతో ముందుకెళ్తున్నది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ. 2100కోట్ల నిర్దేశిత లక్ష్యంలో అసెంబ్లీ ఎన్నికల ప్రభావం పడి ఇప్పటి వరకు కేవలం రూ. 1350 కోట్ల మేర మాత్రమే వసూళ్లను రాబట్టుకున్నది. ఈ తరుణంలోనే పార్లమెంట్ ఎన్నికల ముహూర్తం సమీపిస్తుండడంతో ఈ నెలాఖరు వరకు మాత్రమే ఆర్థిక సంవత్సరం ముగింపు పెట్టుకొని టార్గెట్ అధిగమించాలన్న లక్ష్యంతో జోన్ల వారీగా స్పెషల్ డ్రైవ్‌లు ముమ్మరం చేసింది. ఈ మేరకు రాబోయే 20 రోజుల్లో రూ. 650 కోట్ల మేర టార్గెట్‌ను రాబట్టాలని భావించారు. దీంతో ఉదయం 8 గంటల నుంచే బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు విధుల్లో చేరాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. జీహెచ్‌ఎంసీ పరిధిలోని 30 సర్కిళ్లలోని 300 డాకెట్ల ద్వారా ట్యాక్స్ వసూలు చేస్తున్న 300 మంది బిల్ కలెక్టర్లు, 145 మంది ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు ఉదయమే రంగంలోకి దిగి.. ఆస్తిపన్ను వసూళ్లలో వేగం పెంచాలని కమిషనర్ రోనాల్డ్‌రాస్ ఆదేశాలు జారీ చేశారు.



ఆటోలో అసెంబ్లీకి వెళ్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

ఆటో డ్రైవర్లను ఆదుకొని..

## చిత్తశుద్ధి చాటుకోవాలి

కుత్బుల్లాపూర్/ మల్కాజిగిరి, ఫిబ్రవరి 9: కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఆటోడ్రైవర్లను ఆదుకొని చిత్తశుద్ధిని చాటుకోవాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు డిమాండ్ చేశారు. హైదర్‌గూడలోని ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి అసెంబ్లీ వరకు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో వారు పాల్గొని ఆటోలో అసెంబ్లీకి వెళ్లారు. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని స్వాగతిస్తున్నామని, అయితే రోజూ ఆటోలకు గిరాకీ లేక డ్రైవర్లు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే మర్రి రాజ శేఖర్‌రెడ్డి అన్నారు. హైదర్‌గూడ ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి ఆయన అసెంబ్లీకి ఆటోలో ప్రయాణించారు. అలాగే ఆటో కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలంటూ.. ప్లకార్డుతో ఎమ్మెల్యే మల్లారెడ్డి సైతం ఆటోలోనే అసెంబ్లీకి వెళ్లారు.



## రేవంతన్నా.. జర మమ్ముల్ని కాపాడు..

'అన్నా..రేవంతన్నా జర మమ్ముల్ని కాపాడు... ఫ్రీ బస్ సర్వీస్ రద్దు చేసి.. మా ఆటో డ్రైవర్లను కాపాడండి' అంటూ ఆటో వెనుక అక్షరాల రూపంలో.. తన ఆవేదన వ్యక్తపరుస్తున్నాడో ఆటో డ్రైవర్. ఉచిత బస్సు పథకంతో ఆటో డ్రైవర్లు ఇబ్బందులు పడుతూ.. నిరసనలు తెలుపుతున్న క్రమంలో తన బాధను తెలియజేస్తున్నాడు. హబ్సిగూడ-నాచారం రోడ్డులో కనిపించిందీ దృశ్యం. **-ఉప్పల్**

# బండలు జారి.. గుండెలదిరి

## ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డుపైకి దొర్లుతున్న రాళ్లు

రాకపోకలకు జంకుతున్న వాహనదారులు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 9 (నమస్తే తెలంగాణ): ఓఆర్ఆర్ సర్వీసు రహదారిపై జారిపడుతున్న బండరాళ్లు..ప్రయాణికుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. రింగు రోడ్డు నిర్మాణంలో భాగంగా కొన్ని చోట్ల భారీ ఎత్తయిన గుట్టలను తొలిచి.. రోడ్డు మార్గాన్ని నిర్మించారు. అలాంటి ప్రాంతాల్లో గుట్టల నుంచి బండరాళ్లు జారి.. సర్వీసు రోడ్డు మీదకు వస్తున్నాయి. తరచూ ఇలా జరుగుతుండటంతో ఔటర్ సర్వీసు రోడ్డు మీదుగా వెళ్లే ప్రయాణికులు భయపడుతున్నారు. ముఖ్యంగా నార్సింగి నుంచి తెలంగాణ పోలీస్ అకాడమీ వరకు ఉన్న మార్గంలో మంచిరేవుల వద్ద, రాజేంద్రనగర్-హిమాయత్‌సాగర్ ఇంటర్‌చేంజ్ నుంచి శంషాబాద్ వరకు ఉన్న రెండు మార్గాల్లో ఎత్తయిన గుట్టల మధ్య నుంచే ఔటర్‌ను నిర్మించారు. ఆయా ప్రాంతాల్లోని సర్వీసు రోడ్డుపై ఎప్పుడు బండరాయి జారి మీద పడుతుందోనన్న భయం వాహనదారుల్లో నెలకొన్నది. ముఖ్యంగా రాత్రి వేళల్లో కొన్ని ప్రాంతాల్లో సర్వీసు రోడ్ల మీద రాకపోకలు సాగించలేదని పరిస్థితి ఉంది. మహానగరానికి మణిహారంలా మారిన ఔటర్ రింగు రోడ్డుపై ఉన్న ప్రధాన రహదారి నిర్వహణ సజావుగానే ఉన్నా.. దానికి ఇరువైపులా ఉన్న సర్వీసు రహదారుల నిర్వహణను సరిగా చేపట్టడం లేదని వాహనదారులు వాపోతున్నారు. ఇదిలా ఉంటే గచ్చిబౌలి నుంచి శంషాబాద్ వరకు ఉన్న ఓఆర్ఆర్ సర్వీసు రోడ్లపై భవన నిర్మాణ రంగానికి సంబంధించిన సామగ్రితో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. వాహనాల్లోంచి మట్టి, కంకర సైతం పడుతున్నా, దాన్ని ఎప్పటికప్పుడు తొలగించడం లేదు. అటు జారిపడుతున్న బండరాళ్లు ఒకవైపు.. మట్టి..కంకర మరోవైపు సర్వీసు రోడ్ల మీదుగా ప్రయాణమంటేనే వాహనదారులు జంకుతున్నారు.



రాజేంద్రనగర్ నుంచి శంషాబాద్ మార్గంలోని సర్వీసు రోడ్డులో జారిపడిన బండరాయి